చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

పామిడి: గజరాంపల్లి గ్రామ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఈఓఆర్డీ బీవీ శశికళ పరిశీలించారు. ఈసందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి విక్రయించడం వల్ల పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. సమస్య పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.







నూతన సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలి




ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, కేతిరెడ్డి పెద్దారెడ్డి

శింగనమల: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ అన్ని శుభాలే జరగాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ కోటి ఆశలు, కొంగొత్త ఆశయాలు, బలీయమైన సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గతంలో పూలు, బోకేలు, స్వీట్లకు బదులుగా నియోజకవర్గంలోని విద్యార్థులకు ఉపయోగపడేలా నోటు పుస్తకాలు, చిన్నారులకు పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మునగ మొక్కలు స్వీకరించామన్నారు. ఈ ఏడాది వెదురు మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిద్దామని, శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు పూలు, బొకేలకు బదులుగా వెదురు మొక్కలు తీసుకురావాలని కోరారు.

తాడిపత్రి టౌన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సవరంలో ప్రజలందరికీ శుభం కల్గాలని, సుఖ, సంతోషాలతో విరజిల్లాలని ఆకాంక్షించారు.























క్లుప్తంగా

239 మందికి పింఛన్ల మంజూరు

గుంతకల్లు రూరల్: మండలంలో జనవరి నుంచి 239 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ జాషువా శనివారం తెలిపారు. ఇప్పటివరకూ 5,817 మందికి పింఛన్లు ఇస్తుండగా జనవరి నుంచి 6,056 మందికి రూ.1,68,88,000 అందిస్తామన్నారు. మండలంలో 72 పింఛన్లు రీ వెరిఫికేషన్‌లో ఉండగా ఇప్పటివరకూ 25 మంది లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయిన నేపథ్యంలో యథావిధిగా వారికి పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

261 మందికి పింఛన్ల మంజూరు

పెద్దవడుగూరు : మండలంలోని 25 పంచాయితీల్లో 261 మందికి కొత్తగా ఫించన్లు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ కుల్లాయిస్వామి తెలిపారు. గత నెలలో 7,159 పింఛన్లు పంపిణీ చేయగా 7,350 మందికి పింఛన్ సొమ్ము అందిస్తారన్నారు. వలంటీర్లు పెరిగిన ఫించన్ మొత్తాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఇప్పించాలని సూచించారు.

బాధిత కూలీలను ఆదుకోవాలి

గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన, గాయపడిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యుడు బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం గుత్తి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లు మండలంలోని వైటీ చెరువు గ్రామానికి చెందిన ఇద్దరు కూలీలు మృతిచెందగా, మరో 17 మంది కూలీలు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారన్నారు. మృతుల కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, జగ్గిలి రమేష్, కసాపురం రమేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీగా రామ్‌నాయక్



గుత్తి: ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డీజిల్ షెడ్ బ్రాంచ్ సెక్రటరీగా రామ్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికై య్యారు. రామ్‌నాయక్‌ను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సెక్రటరీ రామాంజులరెడ్డి, నారాయణ, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, సంఘ్ సెక్రటరీ తిరుమల రెడ్డి, డీజిల్‌షెడ్ కార్మికులు అభినందించారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



గోల్డ్ మెడల్స్ అందుకుంటున్న గుత్తి విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని రామానుజన్ పాఠశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 53 ఏళ్లలో ఎస్ఎఫ్ఐ సాధించిన విజయాలను, ఉద్యమాలను వివరించారు. నాయకులు గౌతమ్, శివ, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గుత్తి విద్యార్థుల ప్రతిభ

గుత్తి: ఆళ్లగడ్డలో గత నెల 27 నుంచి 30వ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గుత్తి బాల గంగాధర్ తిలక్ అకాడమీకి చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. కరిష్మా, పూజిత, ఐషూ, అంజుమ్, సానియా, హుసేన్ ఖాన్ అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను తైక్వాండో మాస్టర్ సాయితేజ అభినందించారు.

గరుసు రోడ్డు ఏర్పాటు

పామిడి: ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆదేశాలతో స్థానిక బీసీ కాలనీలోని అంబాభవాని ఆలయవీధిలో శనివారం గరుసు రోడ్డు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ జోజోడే కుమార్ సమక్షంలో పార్టీ నాయకులు సీ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో అబుసాలేహ, కే మహబూబ్‌బాషా దగ్గరుండి రోడ్డుకు గరుసు తోలించి చదును చేయించారు. రాకపోకలకు సుగమం చేసిన ఎమ్మెల్యే వైవీఆర్, వైఎస్సార్‌సీపీ నాయకులకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేపు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం

తాడిపత్రి టౌన్ : స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం జరగనున్నట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సురేంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

జగనన్నతోనే ముస్లింల సంక్షేమం

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



అహమ్మద్‌బాషాకు ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, జిల్లా అధ్యక్షుడు రిజ్వాన్

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. శనివారం స్థానిక అంజుమన్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుంతకల్లు 35వ వార్డు మాజీ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం పట్టణాధ్యక్షుడు అహమ్మద్‌బాషాకు ఎమ్మెల్యే వైవీఆర్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రిజ్వాన్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్య, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ముస్లింల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పోర్టర్స్‌లైన్ ముస్లింల విజ్ఞప్తి మేరకు రూ.కోట్ల విలువైన 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని శ్మశానవాటిక కోసం కేటాయించామన్నారు. యోజకవర్గంలోని ముస్లింల శ్మశానవాటికలు, మసీదుల అభివృద్ధికి లక్షలాది రూపాయలు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడిగా అహమ్మద్ బాషా, సభ్యుడిగా గుత్తి ఫయాజ్ నియామకం కావడం సంతోషకరమన్నారు. వక్ఫ్‌బోర్డు పరిధిలో స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని ఆయన వక్ఫ్‌బోర్డు ప్రతినిధులకు సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రిజ్వాన్, ఉపాధ్యక్షుడు అహ్మద్‌బాష ఇతర సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను ముస్లింలు ఘనంగా సన్మానించారు. పట్టణ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్, అదనపు ఖాజీ సత్తార్ సాబ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ గౌస్, కౌన్సిలర్లు చాంద్‌బాషా, సుమోబాషా, కోఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు యూనస్, యాకుబ్, హొన్నూర్‌వలి, మైనార్టీ కార్యదర్శి మౌలా, మహ్మద్ హుసేన్, అంజుమన్ కమిటీ పెద్దలు అబ్దుల్‌వహాబ్, రవూఫ్, ఆర్‌డీజీ.బాసా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై కక్ష సాధింపు తగదు

- టీడీపీపై కౌన్సిలర్లపై ఫయాజ్‌బాషా మండిపాటు



మాట్లాడుతున్న కౌన్సిలర్ ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు లోబడి విధులు నిర్వహిస్తారని, వారిపై కక్ష సాధింపు చర్యలు ఎందుకని వైఎస్సార్‌సీపీ 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా టీడీపీ కౌన్సిలర్లను నిలదీశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశంతో పాటు, 2023-2024 బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అజెండాలోని అంశాలను సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా చదివి వినిపించారు. సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా డిప్యుటేషన్ రద్దుపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు హీరాపురం ఫయాజ్‌బాషా, రంగనాథ్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. డిప్యుటేషన్ విషయం మున్సిపల్ ఆర్డీ పరిధిలో ఉందని, కౌన్సిల్ పరిధిలోకి రాదని వివరించారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ప్రభుకుమార్ నియామకం జీఓ చెల్లదని టీడీపీ కౌన్సిలర్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్ రెహమాన్‌కు వివరించగా కౌన్సిలర్ ఫయాజ్‌బాషా జోక్యం చేసుకుని జీఓలను కూడా తుంగలో తొక్కుతారా అని ప్రశ్నించారు. ఇరుపార్టీలకు చెందిన కౌన్సిలర్లు ఈ అంశంపై వాగ్వాదానికి దిగగా ఇన్‌చార్జ్ కమిషనర్ జబ్బార్ మియా జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. అనంతరం 2023-2024కు సంబంధించి బడ్జెట్ తీర్మానాలను ఆమోదించి కౌన్సిల్ సమావేశాన్ని ముగిస్తున్నట్లు వైస్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ ప్రకటించారు. మున్సిపల్ డిఈ వెంకటనారాయణ, ఏఈ తేజా, టౌన్ ప్లానింగ్ అధికారి మహబుబ్‌బాషా, మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌కు తీవ్ర గాయాలు



హుస్సేన్ పీరాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం బైక్‌ను కారు ఢీ కొన్న ఘటనలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హుస్సేన్ పీరా తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు..గుత్తిలో నివాసం ఉండే హుస్సేన్ పీరా ఎంగిలిబండ శివారులోని తోటలో సపోటా మొక్కలకు నీరు పెట్టేందుకు వెళ్తున్న సమయంలో తాడిపత్రి వైపునకు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో ఎగిరిపడిన అతడు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు. కాగా హుస్సేన్ పీరా ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

కర్నూలులో పీరాను పరామర్శించిన ఎమ్మెల్యే

కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హుస్సేన్ పీరాను సాయంత్రం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే విచారించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బేడల వెంకట్రాముడు, రమేష్‌రెడ్డి, షఫీ, పామిడి ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా వాచ్‌నైట్ సర్వీసు ఆరాధన

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో శనివారం రాత్రి వాచ్‌నైట్ సర్వీసు ఆరాధనను క్రైస్తవులు భక్తిప్రపత్తులతో పాటించారు. ఈసందర్భంగా గుత్తి డీసీ, చర్చి పాస్టర్ జీ డేవిడ్‌నాయక్ వాచ్‌నైట్ సర్వీసు ప్రాముఖ్యతను వివరించారు. అర్ధరాత్రి విద్యుత్ దీపాలను ఆర్పివేసి క్యాండిల్స్ వెలుతురులో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. అనంతరం క్రైస్తవులు స్వీట్లు పంచుకుంటూ ఆనందోత్సాహాల నడుమ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, అబ్రహాం, జయరాజు, విజయభాస్కర్, బుజ్జిబాబు, ఆనంద్‌రాజ్, దేవదాసు, బాలరాజు, ప్రసాద్, రజని, మంజుల, సుశీలమ్మ, మేరి, జయ, మహిమ, బేబి, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో చిన్నారుల ప్రతిభ

పామిడి: బెంగళూరులోని రియాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో అండర్-18 కేజీల సబ్ జూనియర్ విభాగంలో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థిని సుహాన దిలీషా బంగారు, క్యాడెట్ అండర్ -33 కేజీ విభాగంలో అబ్దుల్ రెహమాన్ సిల్వర్ పతకాన్ని సాధించారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ సతీష్‌కుమార్ శనివారం విద్యార్థులను అభినందించారు. ఇదే పోటీల్లో ప్రతిభ చాటిన చైతన్యస్కూల్‌కు చెందిన విద్యార్థి కేదార్ సింహను స్కూల్ సీఈఓ సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి అభినందనలు తెలియజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెద్దపప్పూరు: అమ్మలదిన్నె గ్రామంలో శనివారం ఓ మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఆదినారాయణమ్మ కుటుంబ కలహాల కారణంగా ఉదయం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి వివరాల మేరకు పెద్దపప్పూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంత ద్వారా రూ.1.81 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,81,280 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్దచర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీసెస్) కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్‌యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ,విక్రయాలు జరుగుతున్నట్లు తెలిపారు.

బైరి నరేష్‌పై కేసు నమోదు చేయాలి



ర్యాలీ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

గుంతకల్లు: వికారాబాద్ జిల్లా కోడంగల్‌లో జరిగిన ఓ సమావేశంలో అయ్యప్ప జననంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పట్టణ ఆయప్ప భక్తి మండలి స్వాములు డిమాండ్ చేశారు. అయ్యప్ప భక్తి మండలి ఆధ్వర్యంలో శనివారం డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని ఆయప్పస్వామి ఆలయం నుంచి వందలాది మంది అయ్యప్ప మాలధారులు ర్యాలీగా ప్రధాన రహదారి మీదుగా పొట్టి శ్రీరాములు సర్కిల్ చేరుకుని పెద్ద ఎత్తున నరేష్‌పై చర్యలు తీసుకోవాలని నినదించారు. బీజేపీ, భజరంగదళ్ నాయకులు మద్దతు ప్రకటించారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

తాడిపత్రి టౌన్ : 2023కు సంబంధించి సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ల(జీవన ప్రమాణ్ పత్రాలు)ను జనవరి 31వ తేదీలోపు ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయాలని తాడిపత్రి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో జనవరి నుంచి అసోసియేషన్ ఆధ్వర్యంలో దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఐడీ నంబర్, బ్యాంకు పాసు పుస్తకం, సాంవత్సరిక సభ్యత్వ పత్రాలతో వస్తే పూర్తి చేసిన దరఖాస్తును ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలియజేశారు. పెన్షనర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



బధిర విద్యార్థుల ప్రదర్శన

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో దివ్యాంగుల పాఠశాల 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఉదయం ఫాదర్ ఫెర్రర్ చిత్ర పటానికి పూల మాల మాలలు వేసి ఆర్డీటీ సిబ్బంది, దివ్యాంగులు నివాలులు అర్పించారు. అనంతరం బధిరుల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డీఐటీ ఇన్‌స్టిట్యూట్ మేనేజర్ సిస్టర్ గ్రేష్మా, పాఠశాల హెచ్ఎం ఎర్రిస్వామి, ఆర్డీటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీటీకి సన్మానం

గార్లదిన్నె: స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. శనివారం గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఉషారాణి కుమారస్వామి సేవలను కొనియాడారు. అనంతరం కార్యాలయ సిబ్బంది కుమారస్వామిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

గుండె వైద్య శిబిరం

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆలయ కల్యాణ మండపంలో ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కిమ్స్ సవీరాకు చెందిన గుండె వైద్యనిపుణుడు రామ్‌కుమార్ సుమారు 230 మందికి జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీఎకో తదితర వైద్యపరీక్షలకు ఉచితంగా నిర్వహించారు. వీరిలో గుండె జబ్బులతో బాధపడుతున్న 15 మందిని గుర్తించి డాక్టర్ వైఎస్సాఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా మెరుగైన చికిత్స అందించడానికి తరలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలోమార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ భీమలింగప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కమిటీ సభ్యుడు కమల్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బుక్కరాయసముద్రం: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మండల కేంద్రంలో ఆదివారం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు వైఎస్సార్ పింఛన్ కానుక కింద ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున అందిస్తారన్నారు.

వాహనం సీజ్

యల్లనూరు: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యూవల్ చేసుకోని టాటా ఏస్ వాహనాన్ని శనివారం ఎంవీఐ శ్రీనివాసులు సీజ్ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

తప్పిన ప్రమాదం

పామిడి: పట్టణంలోని గుత్తి బీసీసీ రోడ్డులో సాయి హాస్పిటల్ సమీపాన శనివారం ఐచర్ వాహనం చెట్టును ఢీకొట్టింది. ఘటనలో చెట్టు వేర్లతోపాటు ఊడిరాగా కరెంటు తీగలు చెట్టు కిందపడకుండా అడ్డుకున్నాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఏఈ మధుసూదన్ ఆధ్వర్యంలో సిబ్బంది వైర్లను సరిచేశారు.

ఉపాధి సిబ్బందికి ఉత్తమ అవార్డులు



పీడీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆదిల్

యల్లనూరు: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సాంకేతిక సహాయకుడు ఆదిల్, యల్లనూరు క్షేత్రసహాయకుడు హనుమంతుకు శనివారం జిల్లా కేంద్రంలో ఉత్తమ అవార్డును డ్వామా పీడీ వేణుగోపాల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు శాలువా కప్పి సత్కరించారు. 2022-2023కు సంబంధించి క్షేత్రసహాయకుడు హనుమంతు 55,169, సాంకేతిక సహాయకుడు ఆదిల్ 1,22,586 పని దినాలు కల్పించారన్నారు.

యువతి మృతి

గార్లదిన్నె: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతి శనివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... మర్తాడుకు చెందినఆంజనేయులు కుమార్తె ఉమాదేవి(25) డిసెంబర్ 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కుర్చీల వితరణ

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రికి శనివారం స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పది కుర్చీలు వితరణగా ఇచ్చారు. సమితి సభ్యుడు విశ్వనాథ్ వాటిని ఆసుపత్రి వైద్యాధికారి ఎల్లప్పకు అందజేశారు. సమితి సభ్యులు మంజునాథ్, సుదీర్, ప్రశాంత్, నాగరాజు, శేఖర్, హెడ్‌నర్సు కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



తాడిపత్రిలో కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తాదులు ఉత్తరద్వారం ద్వారా శ్రీవారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. శనివారం ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడు అంబూర్, పల్లెపట్టు కళాకారులతో ఉత్తరద్వారము, స్వామి విగ్రహాలను విశేష పుష్పాలతో అలంకరిస్తామన్నారు. గతేడాది చేసిన అలంకారాలతో పాటు ఈ యేడాది మత్స్యవతారంలో శ్రీవారు, అన్నపూర్ణేశ్వరి మాత, అయ్యప్పస్వామి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున సుమారు 35 నుంచి 40 వేల మంది భక్తాదులు దర్శించుకోనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. ఉదయం 8 గంటల నుండి భక్తాదులకు సర్వదర్శనం కల్పించనున్నట్లు వారు వెల్లడించారు. భక్తాదులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని లేనిపక్షంలో ఆలయంలోకి అనుమతించేది లేదని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కోశాధికారి సుధాకర్‌గుప్త, సంయుక్త కార్యదర్శి సుదర్శన్‌బాబు, సభ్యులు వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి కరపత్రాల విడుదల

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం జరగనున్న వైకుంఠ ఏకాదశి పర్వదినానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తిరుమల లడ్డుతోపాటు అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సంజన్న, భూమాహరి ప్రసాద్, లక్ష్మీదేవి, మధ్యాల లత, నారాయణమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న చెన్నకేశవ ఆలయం

నార్పల: మండల కేంద్రంలో వెలసిన పురాతన ఆలయమైన చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా అర్చకుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు అభిషేకాలు, 4 గంటల వరకు భూదేవి,శ్రీదేవి సమేత చెన్నకేశస్వామికి ప్రత్యేక అలంకారణ, 5 గంటల నుంచి స్వామి దర్శనం ఉంటుందన్నారు. 11 గంటల నుంచి అన్నదానం, సాయంత్రం 5 గంటల నుంచి పలకల కోలన్న, స్వామి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తామని వివరించారు.

మానసిక దివ్యాంగులకు స్వెటర్లు, పండ్ల పంపిణీ



దివ్యాంగులకు స్వెటర్లు, పండ్లు, కేక్ పంపిణీ చేస్తున్న జాన్సన్

తాడిపత్రి టౌన్: ఆవుల తిప్పాయిపల్లి సమీపంలోని జీవనాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ నేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జాన్సన్ తన కుటుంబ సభ్యులతో కలిసి మానసిక దివ్యాంగులకు స్వెటర్లు, పండ్లు, కేక్ పంపిణీ చేశారు. ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముందస్తు శనివారం మానసిక దివ్యాంగులతో కలసి వేడుకలు జరుపుకున్నట్లు ఆయన తెలిపారు.

నేడు దుస్తుల పంపిణీ

గుంతకల్లు రూరల్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న స్వామి వివేకానంద పార్కులో ఆదివారం ఆర్డీవో రవీంద్ర చేతుల మీదుగా మానసిక వికలాంగులకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రాము శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌లోని 8 మంది తహసీల్దార్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి పేర్కొన్నారు. శనివారం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తల, వ్యవసాయ శాఖ అధికారుల రైతుల సాగు చేసే పంటల సాగుపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సహదేవరెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడి తప్పకుండా చేసుకోవాలన్నారు. పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారులు వివిధ అంశాలపై శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రేకులకుంటలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఏరువాక కేంద్రం, కేవీకే శాస్త్రవేత్తలు, కేవీకే రేకులకుంట పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వేమన సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపు

- విశ్రాంత వైస్ చాన్సలర్ కాడా రామకృష్ణారెడ్డి



వేమన చిత్రపటానికి నీరాజనాలర్పిస్తున్న వేమన ఫౌండేషన్ సభ్యులు

అనంతపురం కల్చరల్: వేమన సాహిత్యానికి, కటారుపల్లెలోని యోగి వేమన సమాధికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికి విశ్రాంత వీసీ కాడా రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. వేమన ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేసిన ప్రభుత్వాన్ని అభినందిస్తూ పలువురు రచయితలు, పరిశోధకులతో సమావేశం జరిగింది. డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రామకృష్ణారెడ్డితో పాటు విశ్రాంత రిజిస్ట్రార్ రవీంద్రరాజు, మానవత సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, రచయితలు రియాజుద్దీన్, మధురశ్రీ, రామలింగారెడ్డి, ఎల్కేపీ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య తదితరులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నీరాజనాలర్పించారు.

హౌసింగ్ ఏఈగా ప్రశాంత్‌కుమార్



యాడికి: హౌసింగ్ ఏఈగా ప్రశాంత్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వజ్రకరూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం ఆర్డీటీ, పీటీసీ క్రీడా మైదానాల్లో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు అంధ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్‌రెడ్డి తెలిపారు. అన్ని జిల్లాలకు చెందిన అంధుల క్రికెట్ జట్లు పాల్గొంటాయన్నారు.

ఘనంగా పల్లకీసేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె. విజయ్‌కుమార్, అర్చకుల ఆధ్వర్యంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి, మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.